క్లుప్తంగా

బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా శుక్రవారం ఓ ప్రకటనలో ముస్లింలకు బక్రీదు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ జరుపుకునే పండుగ బక్రీదు అని, ముస్లిలందరూ ఈ పండుగను భక్తిశ్రద్ధలతో, సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వెరవకుండా దేవునిపై విశ్వాసాన్ని కలిగి, సన్మార్గంలో జీవనం సాగించాలనే గొప్ప సందేశాన్ని బక్రీదు పండుగ చాటుతుందన్నారు. ఈ సందర్భంగా అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ

కర్నూలు: జిల్లాలోని ముస్లింలు, పోలీసు సిబ్బందికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగ అందరి జీవితాల్లో ఆనందోత్సాహాలు నింపాలని, అల్లాహ్ అందరినీ ఆశీర్వదించాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా, ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా బందోబస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రజలు పుకార్లు, వదంతులను నమ్మరాదని, ఏ చిన్న సమస్య తలెత్తినా డయల్ 100కు గానీ, స్థానిక పోలీసులకు గాని తెలియజేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

ఆవోపా ఆర్థిక సహకారం



రామాంజనేయులుకు ఆర్థిక సాయం అందిస్తున్న ఆవోపా నేతలు

కర్నూలు(అర్బన్): థాయిలాండ్‌లో ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు జరుగనున్న ఎస్ఎస్‌డీఎఫ్ థాయిలాండ్ పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ 2025 లెవెల్ – 2 పోటీలకు భారతదేశం తరపున పాల్గొనేందుకు వెళ్తున్న క్రీడాకారుడు రామాంజనేయులుకు ఆవోపా తమ వంతు ఆర్థిక సహకారం అందించింది. శుక్రవారం స్థానిక జొహరాపురం రోడ్డులోని క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో రామాంజనేయులుకు రూ.10 వేలను అందించారు. ఆవో పా అధ్యక్షుడు డాక్టర్ పి.లక్ష్మినారాయణ, సభ్యులు యుగంధర్‌శెట్టి, టీవీ రత్నప్రసాద్, రామచంద్రారావు, సతీష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. థాయిలాండ్‌లో జరుగుతున్న క్రీడల్లో పాల్గొని విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

ఓటరు నమోదుకు సహకరించాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): ఓటరు నమోదుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు కోరారు. ఓటరు నమోదు కార్యక్రమం నిరంతర ప్రక్రియ అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. శుక్రవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు ప్రభుత్వం తరపున బీఎల్‌ఓ ఉంటారన్నారు. రాజకీయ పార్టీల తరపున బీఎల్‌ఓల ద్వారా అర్హులైన వారితో దరఖాస్తు చేయించి ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఎప్పుడైనా ఓటరు నమోదు చేయించుకోవచ్చన్నారు. ఫారం 6, 7, 8 నమోదుకు సైతం రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. డీటీ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

ఆహారం విషతుల్యం!

- అన్ని పదార్థాలను కల్తీ చేస్తున్న వైనం
- కల్తీతో రోగాలు ఖాయం
- త్వరగా మాగేందుకు పండ్లపై రసాయనాలు
- హోటల్, ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌లలోనూ ప్రమాదకర రసాయనాలు
- నేడు వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే



కుళ్లిన పండ్లను చెత్త బండిలో వేయిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్):

● కర్నూలు నగరంలోని పెద్దమార్కెట్ వద్ద ఉన్న ఓ హోల్‌సేల్ పండ్ల దుకాణంలో ఇటీవల అధికారులు దాడులు నిర్వహించారు. అందులో పాడైపోయిన, రసాయనాలతో మాగబెట్టిన పండ్లను గుర్తించి మున్సిపల్ చెత్త వాహనంలో పారవేయించారు.

● ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతంలోని మధులోక్ బార్ అండ్ రెస్టారెంట్‌లో అధికారులు తనిఖీలు నిర్వహించి చికెన్ దమ్ బిర్యానీ శ్యాంపిల్ తీసి ల్యాబ్‌కు పంపించారు. బిర్యానీలో ప్రమాదకరమైన సింథటిక్ కలర్ (అజంతా) కలిపినట్లు నిర్ధారణ కావడంతో వారికి నోటీసులు పంపించారు. వీరిపై గతంలోనూ కేసులున్నాయి.

● జిల్లాలో పలు బెల్లం దుకాణాలపై ఇటీవల అధికారులు దాడులు నిర్వహించి బెల్లం శ్యాంపిల్స్ తీసి ల్యాబోరేటరీకి పంపించారు. ఇందులో కర్నూలులో రెండు, ఆదోని, గూడూరులోని దుకాణాల్లో బెల్లంలో సింథటిక్ కలర్ కలిపినట్లు ల్యాబ్ నివేదిక వచ్చింది. కేవలం కలర్స్ కలపని నల్ల బెల్లం మాత్రమే వాడాలని అధికారులు సూచిస్తున్నారు.

● కర్నూలు నగరంలోని ఓ మిల్క్ డైరీలోని పాల ప్యాకెట్‌పై 'పాలలో ఎలాంటి హార్మోన్లు కలవలేదని, ఎలాంటి ప్రిజర్వేటివ్స్ లేవని, కల్తీ జరగలేదని, యాంటిబయాటిక్స్ వాడలేదని' ముద్రించారు. ల్యాబ్‌కు పంపితే ఆ పాలు కల్తీగా ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది.

● అలాగే నగరంలోని పలు డ్రైఫ్రూట్స్ దుకాణాలపై ఇటీవల అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో మదీనాలో రెండు, డ్రైఫ్రూట్ హౌస్‌పై ఒక కేసు నమోదు చేశారు. వీరు కివీ, పైనాపిల్‌లో సింథటిక్ కలర్స్ కలిపి విక్రయించినట్లు ల్యాబ్‌లో నివేదిక వచ్చింది.


ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి నిద్రించే వరకు ప్రతి మనిషి వాడే ఆహార పదార్థం కల్తీలేదని చెప్పలేని పరిస్థితి. ఏ వస్తువు తీసుకున్నా అంతో ఇంతో అందులో కల్తీ జరిగి ఉంటోంది. ఇటీవల అధికారులు నిర్వహిస్తున్న వరుస దాడుల్లో ఈ విషయం వెలుగులోకి వస్తోంది. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో వ్యాపారులు ఆహార పదార్థాల్లో కల్తీ చేసి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారు. ఇందుకోసం ప్రమాదకర రసాయనాలను, పదార్థాలను వాడుతున్నారు. ఈ నెల 7వ తేదీన వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపుగా చిన్నా పెద్దా హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, చాట్, నూడుల్ షాపులు 7 వేలకు పైగా ఉంటాయి. కర్నూలు నగరంలోనే 1600 దాకా హోటళ్లు, దుకాణాలు ఉన్నాయి. ఆయా వ్యాపార సంస్థల ద్వారా ఏటా వందల కోట్ల వ్యాపారం జరుగుతోంది. రోడ్డుపైడు దుకాణాలతో పాటు కార్పొరేట్ కంపెనీలు విక్రయించే ఆహార పదార్థాలు సైతం కల్తీ జరిగినట్లుగా ల్యాబోరేటరీ నివేదికలు చెబుతున్నాయి.

ఉమ్మడి కర్నూలు జిల్లాకు కర్నూలులోని ఆహార భద్రత ప్రమాణాల శాఖ ఉంది. ఇందులో ఒక ఏఎస్‌ఓ, నలుగురు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఒక సూపరింటెండెంట్ ఉన్నారు. ఒక్కో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నెలకు 12 శ్యాంపిల్స్ సేకరించాలి. రెండు జిల్లాల జనాభాకు అనుగుణంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు లేకపోవడంతో పూర్తిస్థాయిలో వ్యాపారులపై దాడులు నిర్వహించలేకపోతున్నారు. ఉన్న అధికారులు సేకరించిన శ్యాంపిల్స్‌ను ప్రయోగశాలకు పంపి, పరిశీలన తర్వాత కేసులు నమోదు చేయాల్సి ఉంది. కల్తీని బట్టి క్రిమినల్ లేదా సివిల్ కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తారు.

బిర్యానీలు, జంక్‌ఫుడ్‌లో విచ్చలవిడిగా కల్తీ

రోడ్డుపైడు విక్రయించే బజ్జీల పిండితో పాటు గోబీ మంచూరియా, చికెన్ మంచూరియా, ఫాస్ట్‌ఫుడ్‌తో పాటు జంక్‌ఫుడ్‌లలోనూ కల్తీ జరుగుతోంది. జంక్‌ఫుడ్‌లలో ప్రమాదకరమైన సింథటిక్ కలర్స్‌తో పాటు టేస్టీ సాల్ట్‌ను వేయడంతో అవి రుచిని పెంచుతున్నాయి. ఈ రుచికి అలవాటు పడిన వారు తిరిగి అక్కడికే వెళ్లి తింటున్నారు. అలాగే పలు హోటళ్లు, రెస్టారెంట్లలో చేసే పలు రకాల బిర్యానీలు, గ్రేవీ ఐటమ్స్, ఫ్రైస్‌లలో టేస్టీ సాల్ట్, సింథటిక్ ఫుడ్ విచ్చలవిడిగా వాడుతున్నారు. ఇందులో ప్రముఖ రెస్టారెంట్లు కూడా ఉండటం గమనార్హం.



సింథటిక్ రంగు కలిపిన గోబీ మంచూరియా



బిర్యానీలో కలిసిన సింథటిక్ రంగు

నిత్యావసరాలన్నీ కల్తీ

ఉప్పు, పప్పు, బియ్యం, గోదుమలు ఇలా నిత్యావసరాలన్నింటినీ వ్యాపారులు కల్తీ చేసి విక్రయిస్తున్నారు. కొందరు తూకం ఎక్కువగా రావడానికి మట్టి, రాళ్లను వేస్తుండగా, మరి కొందరు ఆహార పదార్థాలు ఆకర్షణీయంగా కనిపించేందుకు రంగులు కలిపి విక్రయిస్తున్నారు. కర్నూలులో అధికారులు ఇటీవల నిర్వహించిన దాడుల్లో ఇలాంటి మోసాలు అనేకం బయటపడుతున్నాయి. ముఖ్యంగా ఆహార పదార్థాల తయారీ సంస్థల నుంచే ఇవి కల్తీ జరిగి వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆయా సంస్థలకు నోటీసులు అందజేశారు.



రంగు కలిపిచేసిన బెల్లం ఉండలు

అనుమతి లేకుండా వ్యాపారాలు

ఏదైనా వ్యాపారం చేయాలంటే తప్పనిసరిగా ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి అనుమతి తీసుకోవాలి. పరిశుభ్రత విషయంలో గెజిటెడ్ ఫుడ్‌ఇన్‌స్పెక్టర్‌కు దరఖాస్తు చేయాలి. ఈ శాఖలో నిర్ణీత రుసుము చెల్లించి అనుమతి పొందాలి. కానీ జిల్లాలో ఇలా అనుమతి తీసుకుని వ్యాపారం చేసే సంస్థలు నూటికి 25 శాతానికి మించి ఉండటం లేదు. చాలా మంది ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే వ్యాపార దుకాణాలు తెరిచేస్తున్నారు. వాటిలో కనీస శుభ్రత, కల్తీ నివారణ చర్యలు తీసుకోవడం లేదు. అన్ని దుకాణాల్లో ఆహార భద్రత అధికారులతో పాటు మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సైతం పర్యవేక్షణ చేయడం లేదు.

ప్రజలు ఇంటి ఆహారాన్నే తినాలి



కల్తీ ఆహారానికి ప్రజలు దూరంగా ఉండాలి. ఆర్డర్ పెట్టి తెప్పించుకునే పదార్థాలు ఎక్కువగా నిల్వ చేసినవి ఉంటున్నాయి. దానికన్నా నేరుగా హోటళ్లు, రెస్టారెంట్లకు వెళ్లి ప్రత్యక్షంగా తయారు చేయించుకుని తినడం మేలు. జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్‌తో ఊబకాయం వస్తుంది. దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయి. సింథటిక్ కలర్స్, టేస్టీ సాల్ట్ కలిపిన ఆహారం తినడం వల్ల జీర్ణకోశ వ్యాధులు, అల్సర్లు, క్యాన్సర్లు వస్తాయి. మిల్లెట్ ఆహారం ఎంతో మంచిది. అది కూడా పలు రకాల వెరైటీలను ఇంట్లోనే తయారు చేసుకుని తినడం మేలు. **–టి.రాజగోపాలరావు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, కర్నూలు**



పాలను శ్యాంపిల్ తీస్తున్న అధికారులు

కల్తీ జరుగుతోంది ఇలా..!

- పాలల్లో చిక్కదనం కోసం నాసిరకం పాల పౌడర్లు, యూరియా, పిండి,నూనె కలుపుతున్నారు.
- టీ పొడిలో ఇనుప రజను, రంపపు పొట్టు మిక్సింగ్ చేస్తున్నారు. దీనివల్ల ఊపిరితిత్తులు పాడయ్యే ప్రమాదం ఉంది.
- పశువుల ఎముకలను బట్టీల్లో మరిగించి ద్రావణాన్ని తీసి సాధారణ నూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీనివల్ల జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- చికెన్, మటన్ బిర్యానీలు, తందూరి చికెన్‌లలో హానికరమైన రంగులను వాడుతున్నారు. అనారోగ్యానికి గురైన, ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెలు, పొట్టేళ్లు, మేకల మాసం వినియోగిస్తున్నారు.
- నిషేధానికి గురైన క్యాట్‌ఫిష్‌లను సైతం చేపల విక్రయదారులు అమ్ముతున్నా అడిగే నాథుడు లేరు. వీటిని చికెన్, మటన్ వ్యర్థాలతో చెరువులు, నదుల్లో పెంచి పోషిస్తారు.
- మిరపకాయల్లో ఎరుపు రంగు కోసం సూడాన్ రంగులు వాడుతుంటారు. పసుపులో మెటానిల్ ఎల్లో అనే పదార్థాన్ని కలుపుతారు. వీటిని వంటలో వినియోగిస్తే క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.
- చిన్న హోటళ్లు, కర్రీ పాయింట్లలో వేడి కూరలను పల్చటి పాలిథిన్ కవర్లలో వేసి ఇస్తున్నారు. పదార్థాల వేడికి ప్లాస్టిక్ కరిగి వాటిని తినే వారికి అనారోగ్యం కలిగిస్తున్నాయి.
- అల్లం, వెల్లుల్లి పేస్టులో ఆలుగడ్డ, ఉల్లిగడ్డ పేస్ట్‌ను కలుపుతున్నారు.

క్షయ పరీక్షలను సద్వినియోగం చేసుకోండి



కంబదహాల్‌లో క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

సి.బెళగల్: గ్రామాల్లో ఉచితంగా నిర్వహిస్తున్న క్షయ వ్యాధి (టీబీ) నిర్ధారణ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ సునీత సూచించారు. టీబీ నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కంబదహాల్ గ్రామంలో వైద్య సిబ్బందితో డివిజన్ టీబీ సూపర్‌వైజర్ నాగమహేంద్ర అవగాహన ర్యాలీ, టీబీ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డాక్టర్ గ్రామ ప్రజలతో మాట్లాడారు. టీబీ పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు వ్యాధి నిర్ధారణ అయిన వారికి వైద్యం, ఆర్థిక సాయం అందిస్తారని, పరీక్షలు చేయించుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 60 సంవత్సరాల పైబడి వయస్సు ఉండి, బీపీ, షుగర్, ఆయాసం, దగ్గు లక్షణాలు ఉన్న 23 మందికి గళ్ల పరీక్షలు నిర్వహించి, టీబీ నిర్ధారించడం జరిగిందని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలలపాటు ఉచితంగా మందులు, పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.వెయ్యి చొప్పున అందించనున్నట్లు టీబీ సూపర్‌వైజర్ నాగమహేంద్ర తెలిపారు. పీహెచ్‌సీ ఆయుష్ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ మంగమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్ష పూర్తి చేసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు: జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి సూచించారు. కర్నూలు శివారులోని జిల్లా జైలుతో పాటు మహిళా జైలును ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్ గురించి వివరించారు. ఇందులో ఒక న్యాయవాది, ఒక పారా లీగల్ వలంటీర్ ఉంటారని, వారి ద్వారా ఖైదీలకు న్యాయ సలహాలు అందిస్తారని తెలిపారు. ఖైదీలకు న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. 70 ఏళ్ల వయసు పైబడిన ఖైదీలకు, అనారోగ్యంతో బాధ పడేవారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. అలాంటి వారికి త్వరగా బెయిల్ మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. ఖైదీలకు అందించే ఆహారం, రేషన్, ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైదీలను కోర్టు వాయిదాలకు కచ్చితంగా హాజరుపరచాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నంబర్ 15100పై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జైలు అధికారులతో పాటు న్యాయవాది శివరాం, ఖైదీలు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభను మెరుగుపరుచుకోవాలి



ప్రతిభా అవార్డులకు ఎంపికైన విద్యార్థులతో ఈడీ రమాదేవి, తదితరులు

కర్నూలు కల్చరల్: జిల్లాలోని నారాయణ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా అవార్డులు లభించాయని, అందుకు ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని పాఠశాలల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమాదేవి అన్నారు. స్థానిక ఎల్కూరు బంగ్లా నారాయణ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అభినందన సభలో ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ప్రతిభను మెరుగురు పరుచుకోవాలన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా అవార్డుల జాబితాలో మాధవనగర్, ఎలుకూరుబంగ్లా నారాయణ పాఠశాలల విద్యార్థులు నలుగురు ఉండటం విశేషమన్నారు. ఆర్ అండ్ డీ నరేష్, కో ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ హైర్ బస్ కార్మికుల వేతనాలు పెంచాలి

కర్నూలు(సెంట్రల్): ఏపీఎస్ఆర్టీసీలో పనిచేస్తున్న హైర్ బస్సు కార్మికుల వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో యూనియన్ నాయకులు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో హైర్ బస్ కార్మికులు, యాజమాన్యాలు చేసుకున్న ఒప్పందం గడువు ముగిసిందన్నారు. ప్రస్తుతం యాజమాన్యాలు యూనియన్‌తో చర్చలు జరిపి వేతనాల పెంపుపై కొత్త ఒప్పందం చేసుకోవాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు సుబ్బయ్యగౌడ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పేరిట దోపిడీని అరికట్టాలి

కర్నూలు(సెంట్రల్): కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో పుస్తకాల మాఫియాను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో శ్రీచైతన్య, నారాయణ, శ్రీలక్ష్మీ, మాంటిస్సోరి, భాష్యం విద్యాసంస్థల ఎదుట నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాసంవత్సరం ప్రారంభం కాక మునుపే పుస్తకాల పేరుతో ఎల్‌కేజీ విద్యార్థికి రూ.5 వేలు, పదో తరగతి విద్యార్థులకు రూ.10 వేల వరకు, ఇంటర్మీడియెట్‌కు రూ.20 వేలు వసూలు చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.సత్యనారాయణ గుప్తా శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం జూన్‌లో పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పి ఇప్పుడు మిన్నకుండిపోవడం దారుణమని మండిపడ్డారు. పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ముగిసిన వేసవి శిబిరం

కర్నూలు కల్చరల్: కల్లూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన సమ్మర్ క్యాంప్ శుక్రవారం ముగిసింది. క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులకు వ్యాసరచనతో పాటు, వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఇ.సంధ్యారాణి మాట్లాడుతూ..విద్యార్థులకు పుస్తక పఠనం, శ్రవణం, కథలు వినడం, చెప్పడం, డ్రాయింగ్ లాంటి అంశాల్లో శిక్షణ ఇచ్చామన్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలి

కర్నూలు(సెంట్రల్): ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై యాజమాన్యాలు వేధింపులను ఆపాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎస్.షాబీర్‌బాషా, కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో వారు మాట్లాడుతూ.. ఆయా యాజమాన్యాలు ఉపాధ్యాయులు, అధ్యాపకులపై అడ్మిషన్ల భారాన్ని నెట్టడం అన్యాయమన్నారు. అడ్మిషన్ల ప్రచారానికి వెళ్లాలని ఒత్తిడి చేయడం, అడ్మిషన్లు చేయని వారిని తొలగించడం అన్యాయమన్నారు. దీంతో వారు తీవ్ర మనోవేదన పడుతున్నారని చెప్పారు. ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎస్.శరత్ కుమార్, చంటి, నవీన్ పాల్గొన్నారు.

హెల్త్ ఎడ్యుకేటర్ హోదా మార్పుపై హర్షం



డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): హెల్త్ ఎడ్యుకేటర్ పోస్టు హోదాను డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా మార్పు చేయడం పట్ల రాష్ట్ర హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీస్, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డబ్ల్యూ.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి చేజెర్ల సుధాకర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం వారు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళను కలిసి అభినందనలు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి హరిప్రసాద్, సరోజినిదేవి, జాయింట్ సెక్రటరీలు అనురాధ, పద్మావతి, కర్నూలు జిల్లా అధ్యక్షులు సుభాషిణి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

యోగా భూషణ్ అవార్డుకు ఎంపిక



అవార్డుకు ఎంపికైన ముంతాజ్, అవినాష్ శెట్టి

కర్నూలు (టౌన్): జిల్లాలో యోగా అభివృద్ధికి కృషి చేస్తున్న గురువులు ఎస్.ముంతాజ్ బేగం, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి ప్రతిష్టాత్మక యోగా భూషన్ అవార్డులకు ఎంపికయ్యారు. అఖిల భారత యోగా మహా సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో ఈనెల 15న అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు మంగేష్ త్రివేది శుక్రవారం వెల్లడించారు. అవార్డుకు ఎంపిక కావడంపై రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంత రెడ్డి, ఒలింపిక్ సంఘం సీఈఓ విజయ్‌కుమార్, అధ్యక్ష, కార్యదర్శులు కేఈ జగదీష్ కుమార్, శ్రీనివాసులు, క్రీడా సంఘాల కార్యదర్శులు డాక్టర్ రుద్రారెడ్డి, ఈశ్వర్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

విశాఖ ఉక్కును పరిరక్షించుకుందాం



సమావేశానికి హాజరైన కార్మిక సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన 2500 మంది కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, పరిశ్రమను ప్రైవేట్ పరం చేయరాదని కోరుతూ జూన్ 9వ తేదీన జిల్లా, డివిజన్ కేంద్రాల్లో తలపెట్టిన నిరసన, ప్రదర్శనలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయా సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గత నెల 20వ తేదీన విశాఖ ఉక్కు కోసం తలపెట్టిన సమ్మెను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగ్నం చేశాయని విమర్శించారు, పోలీసులు, పారా మిలిటరీ బలగాలను దింపి కార్మికులను ఆందోళనలు చేపట్టకుండా భయపెడుతుండడం దారుణమన్నారు. ఈ క్రమంలో 9వ తేదీన చేపట్టే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆ రోజున కర్నూలులో జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు కార్మికులు, ఉద్యోగులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేష్‌నాయక్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు, సీఐటీయూ న్యూసిటీ కార్యదర్శి మార్రెళ్ల విజయ్, ఓల్డ్ సిటీ కార్యదర్శి సాయిబాబా పాల్గొన్నారు.

బ్యానర్లు, పోస్టర్ల తొలగింపు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కౌన్సిల్ సంఖ్య 78 తీర్మానానికి విరుద్ధంగా వివిధ ప్రాంతాల్లో అతికించిన పోస్టర్లు, బ్యానర్లను శుక్రవారం నగరపాలక టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. గత కొంత కాలంగా నగర సుందరీకరణ పనులను పాడు చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు వెల్లడించారు. అందులో భాగంగానే పోస్టర్ల తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

ఫ్లోరైడ్ నీటితో వ్యాధులు



ఫ్లోరోసిస్ అవగాహన పోస్టర్లు ప్రదర్శిస్తున్న డాక్టర్ సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల పలు రకాల వ్యాధులు దాపురిస్తాయని ఫ్లోరైడ్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ చెప్పారు. శుక్రవారం కల్లూరు మండలంలోని నాయకల్లు గ్రామంలో జాతీయ ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్లోరైడ్ ఉన్న నీటిని తాగడం వల్ల దంతాలు పసుపు, గోధుమ రంగులకు మారతాయని, కిడ్నీ సంబంధిత వ్యాధులు, ఎముకలు వంగిపోయి కీళ్ల నొప్పి రావడం, పేగు గోడలు దెబ్బతిని శరీరానికి పోషకాలు, ఖనిజ లవణాల శోషణ తగ్గిపోతుందని చెప్పారు. దప్పిక తీరకపోవడం, పిల్లల పెరుగుదలపై కూడా ప్రభావం చూపుతుందన్నారు. అలాగే బీడీ, చుట్ట, పాన్, పాన్ మసాలా లాంటివి ఉపయోగించడం వల్ల ఫ్లోరోసిస్ సంబంధిత ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. అనంతరం ప్రజలకు మల్టీవిటమిన్, విటమిన్–సి మాత్రలను అందించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీలత, ఆరోగ్య కార్యకర్త మల్లీశ్వరి, ఆశా కార్యకర్త సుకన్య, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.